# గెలుపు నాదే

ఈ మధ్య నాకూ మా ఆయనకీ బొత్తిగా చింతకాయ, గోంగూరలావుంది. భార్యా భర్తల్లో ఎవరో ఒకరు రచయిత అయితే రెండో వాళ్ళనుభవించవలసిన హింస కంటె ఇద్దరూ రచయితలైతే ఇద్దరూ అనుభవించే హింస చాలా ఎక్కువ, అందునా ఇద్దరూ పరస్పర విరుద్ధాలైన భావాలుగల రచనలు చేసేవారయితే ఆ బాధ భరించడం ఇద్దరికీ శక్తికి మించినపనే.

మా ఆయన ప్రోత్సాహం వల్ల నేను రచయిత్రిని కాలేదు. మా పెళ్ళికాక ముందే మేం ఇద్దరం పత్రికల్లో రచనలు ప్రచురించిన వాళ్ళమే, అఫ్‌కోర్స్, అప్పటికి ఆయనే నాకంటే ఎక్కువ రచనలు ప్రచురించారనుకోండి. రచయిత గొప్పదనానికి రాశి ఎంత మాత్రం కొలబద్దకాదని పెళ్లినాడే మా ఆయనతో చెప్పాను, మా పెళ్లయిన తరువాత ఆయన రచనల సంఖ్య బాగా తగ్గిపోగా నా రచనల సంఖ్య బాగా పెరిగింది.

1961 ప్రాంతాల్లో నా నవలకొకదానికి ఒక ప్రముఖ వార పత్రిక ప్రథమ బహుమతి ప్రకటించి వెయ్యి రూపాయలిచ్చింది, అప్పట్లో ఆ మొత్తం బాగా ఎక్కువనే చెప్పాలి. నవలకి రెండుమూడు వందలకంటె ఎవ్వరూ ఎక్కువిచ్చేవారు కాదట. నాకు లభించిన ప్రోత్సాహానికి నేను చాలా సంతోషించాను, గర్వించాను కూడానూ. అప్పుడు మా వారు ఏమన్నారంటే-నువ్వు రాసింది మంచి నవలకాదు సరికదా అసలు నవలేకాదు. ప్రపంచ సాహిత్యంలోని కొన్ని గొప్ప నవలల్ని చదువు. నవల లక్షణాలు గ్రహించు, ప్రజాజీవితాన్ని కూడా పరిశీలించి అప్పుడు నవలా రచన ప్రారంభిస్తే, అంతగొప్పవికాకపోయినా ఒక మాదిరి నవలలయినా రాయగలవు-అంటూ హితోపదేశం చేశారు. మా మధ్య అభిప్రాయభేదాలు అప్పటికి అంతగా ముదరలేదు గనక విని ఊరుకున్నాను. ఇప్పటికి నేను 50 నవలలు 500 కథలు ప్రచురించాను. నేను రాసిన 12 నవలలు సినిమాలుగా వచ్చాయి. అందులో నాలుగు హిందీలో కూడా నిర్మించబడి ఆర్థికంగా ఘన విజయం సాధించాయి.

ఇక మావారు ఇప్పటికి ఒక నలభయి కథల వరకూ ప్రచురించారు. 15 కథలు ఒక సంపుటంగా వచ్చాయి (అది అచ్చుకావడానికి చేతి డబ్బు పెట్టుకున్నారు) ఆ కథల గురించి పత్రికల్లో చాలా ఎక్కువగా చర్చలు సాగాయి. 70 లో-కాదు 72 లో ననుకుంటాను - సాహిత్య ఎకాడెమీ ఆ కథల సంపుటికి బహుమతి యిస్తే పుచ్చుకోలేదు. పుచ్చుకోకపోగా ఒక పత్రిక వారికిచ్చిన ఇంటర్వ్యూలో ఎకాడమీ అవలంబిస్తున్న పచ్చి అభ్యుదయ నిరోధక ధోరణిని దుయ్యబట్టారు. రచయిత్రుల సమావేశంలో అందరూ నన్నదే అడుగుతూ మీ వారు పచ్చి లెఫ్టిస్టులావున్నారే-అన్నా రొకరు, బహుమతిని తిరస్కరించి తద్వారా గొప్ప కీర్తి పొందుదామనుకున్నారా-అనింకొకరూ, అంటూవుంటే నాకేం సమాధానం చెప్పాలో పాలు పోలేదు.

ఆయన పూజా పునస్కారాలు చెయ్యరు. పెళ్లయిన మూడో నాడే జంధ్యం తెంపి పారేశారు. పూర్వజన్మలూ, జాతకాలూ, శకునాలూ నమ్మరు. కులాలూ మతాలూ పోవాలంటారు.

మీరు జంఝుం తెంపేసుకున్నారుగదా, నేను పుస్తెలు తీసి పారేస్తేనో ? -అన్నానోకసారి పెంకితనంగా

తప్పకుండా తీసి పారెయ్-అన్నారు.

మరయితే కాలేజిలోకుర్రాళ్ళకి ఇలాగే పాఠాలు చెబుతున్నారా-అనడిగాను.

ఇలాగే చెబుతున్నాను. ఈ నాటి యువతరాన్ని పట్టిపీడుస్తున్న మత మౌఢ్యం వదిలించడం. హేతువాదంతో కూడిన శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునేలా చెయ్యడం నా బాధ్యత దీన్ని నేనొక యావజ్జీవిత కార్యక్రమంగా చేపట్టాను-అంటూ యేవేవో చెప్పారు.

పాఠాలు చెప్పడం మానేసి ఇలాంటివన్నీ చెబుతున్నారా ? మీ ఉద్యోగధర్మం ఏమిటి నిర్వహిస్తున్నారు-అన్నారు.

అదేం లేదు, పాఠాలు సక్రమంగా చెబుతూనే యివన్నీ చేస్తున్నాను-అన్నారు.

అడ్డంగా వాదించే వాళ్ళతో ఎవడు మాట్లాడగలడు?

నేను రచనల్లో, ఫ్యూడల్ వ్యవస్థకు పట్టం కడుతున్నానట. సమాజాన్ని వెనక్కి నడిపించాలని చూస్తున్నానట, పచ్చి ప్రగతి నిరోధక భావాలతో ప్రేమ కథల్తో యువతరాన్నీ, తెలుగు నవలా రంగాన్నీ కూడా అధోగతిపాలు చేస్తున్నానట. బాబాల అమ్మల మహిమలు వర్ణించి జాతిని నిర్వీర్యం చేస్తున్నానట. ఎలా భరించడం యివన్నీ ? నా సోదర రచయిత్రులు చాలమంది ఇలా ఇష్టంలేని కాపురం చేసేకంటే విడాకులిచ్చెయ్యగూడదా? ఆర్థికంగా ఇబ్బందులు పడిపోవాలనే బాధ ఎలాగూ లేదుగదా అని సలహాయిచ్చారు. మరి కొందరు - నేనయితే ఈ పాటికి విడాకులిచ్చేద్దును, అని వీరావేశంతో కూడా మాట్లాడారు.

నేను రాసిన 'అందమైనపూలు ఆరనికన్నీళ్లు తీరనివ్యథలు' అనే నవల ఒకానొక వార పత్రికలో-మధ్య పేజీల్లోని ప్రత్యేకానుబంధంగా- సీరియల్‌గా వస్తోంది. దాన్ని పుస్తక రూపంలో ప్రచురించడానికి ఇద్దరు ముగ్గురు ప్రచురణ కర్తలు పోటీలు పడి చాలా పెద్ద మొత్తాలు పట్టుకుని తిరుగుతున్నారు. మద్రాసు నుంచి ఒక ప్రొడ్యూసర్, ఇద్దరు డిస్ట్రిబ్యూటర్లు వచ్చి ఆనవల సీరియల్‌గా ఆ పత్రికలో ప్రచురణ పూర్తయ్యేలోగా దాన్నొక భారీ సినిమా స్కోప్ చిత్రంగా రూపొందిస్తామని, ఆ కథ యిచ్చి సహకరించమని ప్రాధేయ పడ్డారు. సరేకదానని ఇరవయివేలు ఎడ్వాన్సు పుచ్చుకుని కథ యిచ్చాను. ప్రచురణకర్త దగ్గిర కూడా పదివేలు పుచ్చుకొని ప్రచురణ హక్కులు 1980 డిసెంబర్ 31 వరకు మాత్రమే-యిచ్చాను.

గత జనవరిలో మరో రెండు నవలలు ఏ పత్రికలోనూ సీరియల్‌గా రాకుండా నేరుగా పుస్తక రూపంలో వచ్చేశాయి. అందులో ఒక నవల పూర్తిగా నా దస్తూరితోనే యథాతథంగా బ్లాక్ తీయించివేశారు.

ఇటీవల ఒక ప్రముఖ దినపత్రిక యజమాని స్వయంగా నన్ను కలిసి ఒక సూచన చేశాడు.

మీ నవల మాదినపత్రికలో ప్రతిరోజూ సీరియల్‌గా వేస్తాం. మా పత్రికలో యిప్పటికి అయిదు ముఖ్య కేంద్రాల్నించి వెలువడుతోంది. అన్ని ఎడిషన్స్‌లోనూ అచ్చయి తెల్లవారేసరికల్లా కాఫీకంటే ముందుగా

ఆశేషాంధ్ర పాఠకలోకాన్ని అలరిస్తుంది. అయితే కనీసం ఆరు నెలలకయినా సరిపోయేలా నవలరాయాలి. హిందీ చిత్ర రంగంలోని ప్రముఖ నటీనటుల్ని మోడల్స్‌గా తీసుకుని ఆ ఫోటోలు కథలో తగిన విధంగా వేస్తూవుంటాము. ఇదొక సరికొత్త ప్రయోగం మీరు మాకు సహకరించాలి అన్నాడు.

మీకు చెప్పకేమీ, నేను చాలా త్రిల్ ఫీలయ్యాను. మరో వారం రోజులు పోయేక కలవండి. ఆలోచించి చెబుతాను. అని పత్రిక యజమానిని పంపించేశాను. తప్పకుండా నవల యివ్వాలి సుమండి అనిబ్రతిమాలుతూ వెళ్లాడు. వెంటనే ఒప్పేసుకుంటే బావుండదని అలా అన్నానుగాని నిజానికి వెంటనే సరేనందామనిపించింది. పక్క గదిలోకి వెళ్లేసరికి మా ఆయన పడిపడీ నవ్వుతూ కనిపించారు.

ఏమిటీ అయిదు ఎడిషన్ల దినపత్రికలో ఆరు నెలలు వచ్చే సీరియల్ నవల రాస్తావా-అంటూ ఒకటే నవ్వు. నాకు వళ్ళు మండింది ఆయన వేళాకోళంచూసి. ఆడవాళ్ళు గొప్పవాళ్ళవుతుంటే ఈ మగవాళ్ళకి-ముఖ్యంగా మొగుళ్ళకి, ఎంతకుళ్ళో చెప్పలేను

నాలుగయిదు రోజుల తరవాత తెలిసింది. ఆ పత్రిక యజమాని చాలా జిల్లాల్లో, ఏజన్సీ సరుకులు పెద్దపెట్టున పట్టణాలలో అమ్ముతూ, గత అయిదారేళ్ళుగా విపరీతమైన లాభాలు తీశాడట. సాహిత్యరంగంలో కొత్త ప్రయోగం కోసం ఆ సొమ్ము ఖర్చుపెట్టాలని సరదాతో వున్నాడట, సాహిత్య పోషణంటే అలా వుండాలి.

మరో వారం రోజుల తరవాత పత్రిక యజమాని రావడం, నేనాసూచనని అంగీకరించి ఎడ్వాన్సు పుచ్చుకోవడం, మరో పదిహేను రోజుల తరవాత నెల రోజుల వరకూ సరిపోయే విధంగా నవలలో కొంతభాగం స్క్రిప్టు యివ్వడం అన్నీ జరిగిపోయాయి. అన్ని దిన, వార, పక్ష, మాస, పత్రికల్లోనూ (స్త్రీల పత్రికల్తో సహా) ఈ సరి కొత్త ప్రయోగ నవల గురించి ప్రకటనలు అదిరిపోయేలా వచ్చేస్తున్నాయి.

నాకు ఇటీవల పరిచయమైన మహిళా సంక్షేమశాఖాధికారిణి మాయింటికి వచ్చి నన్ను మరీ మరీ అభినందించి నవల పూర్తికాగానే రాష్ట్రంలోని అన్ని మహిళా మండలి శాఖలలోనూ నా నవలగురించి చర్చలు, వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేస్తానని మాటయిచ్చింది. నేను తీసుకున్న ఇతి వృత్తం ద్వారా ప్రభుత్వం చేపట్టిన ఎన్నో ప్రగతిశీల పథకాల గురించి ప్రచారంచేసే అవకాశం వుందట.

నా నవల దిన పత్రికలో సీరియల్‌గా రావడం ప్రారంభమైననాటి సాయింత్రం ఫ్రెండ్స్ అందరికీ ఘనమైన పార్టీ ఏర్పాటు చేశాను.

ఆరోజు మధ్యాహ్నం మా ఆయనకీ, నాకూ అతి ఘోరమైన వాదోపవాదాలు చెలరేగాయి. నా నవల ఆ రోజువచ్చిన మేరకు చదివి దానివల్ల ప్రజలకి తీవ్రమైన అపకారం జరగబోతున్నదన్నారు. మొదట్లో నేను కోపం తెచ్చుకోలేదు. ఆశ్చర్యం ఏమిటంటే ఆ నవలను నేను ముందుముందు ఎలా నడిపిస్తానో, ముగిస్తానో కొంచెం యించుమించు చెప్పేశారు. ప్రజల ఆలోచనల్ని తప్పుదారి పట్టించే నవల అన్నారు. నాకు కోపం వచ్చేసింది. నా కథని ముందుగా చెప్పగలగడం నా కోపానికి కారణం అయివుండొచ్చు. సర్రున లేచి, ఆ నవల్ని నాయిష్టం వచ్చినట్లు రాస్తాను అడగడానికి మీరెవరన్నాను. నాకు నిజంగానే కోపంవస్తే, నవల్ని ఎలా కావాలంటే అలా నడిపించేస్తాను. పాఠకులు చదవరన్న భయం నాకులేదు. మధ్య ఈయన కెందుకూ ?

నాలాంటివాళ్ళే నిజమైన సంఘద్రోహులట. సంఘం లోని సమస్యల్ని వొదిలి కొద్దిమంది వ్యక్తుల సమస్యల్ని తీసుకుని సెంటిమెంట్ జోడించి అశాస్త్రీయంగానూ అభ్యుదయ నిరోధకంగానూ రచనలు చేసి ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టిస్తున్నానట. కళలగురించి అర్థంలేని తప్పుడు రాతలు రాస్తున్నానట. విజ్ఞానశాస్త్రానికి కూడా వక్రభాష్యం రాస్తున్నానట. ఆయన నోటి దురుసు ఏమని చెప్పను ? పోనీ మీ అరుదైన, అభ్యుదయకరమైన కథల ద్వారా ప్రజలకి చేసిపడిపోతున్న మేలు ఏమిటీ ? అనడిగాను నాకు మండి.

ప్రాచీన కాలంలో చాలా పెద్దపెద్ద జంతువులుండేవి. వాటి మోడల్స్ మ్యూజియంలలోనూ, జంతు ప్రదర్శన శాలల్లోనూ నువ్వు చూసేవుంటావు. వాటి శరీరంలోని చిన్న ఎముక ఒకోసారి ఆరేసి అడుగులుకూడా వుండేది అంటే అది ఎంత పెద్దజంతువైవుంటుందో ఊహించుకో. ఆ జంతువులేవీ ఇప్పుడు లేవు, కాలగమనంలో నశించి పోయాయి. చీమమాత్రం అప్పుడూవుంది. యిప్పుడూ వుంది. నీ రచనలు రాక్షసి జంతువుల్లాంటివి. నా రచనలు చీమల్లాంటివి - అన్నారు.

నాకు ఒక్కముక్కకూడా బోధపడలేదు. కాని నా నవలని రాక్షసి జంతువు అన్నారనిమాత్రం తెలిసింది. దిన పత్రికలో ఆరునెలలు రాబోయే సీరియల్ రాస్తున్నా నేకదా ఆయన ఉక్రోషం. సరే ఈవారంలోనే ముగించేస్తాను.

మా వాగ్వాదం సడెన్‌గా ఆగిపోయినట్టనిపించింది గాని నేను మాత్రం ఫ్రెండ్స్‌కి పార్టీయిచ్చే మూడ్‌లోనేను. ఇంతలోనా స్నేహితురాలు కామేశ్వరివచ్చి నాగోడు విని నాకు ధైర్యం చెప్పింది. ప్రాణంలేచి వచ్చింది.

నా నవల సంవత్సరంవరకూ సాగేలా రాయాలని నిర్ణయించుకున్నాను. కొంచెం ఆలస్యంగానయినా పార్టీఘనా తిఘనంగా జరిగింది. నారచనాశక్తిని ప్రజలు వేనోళ్ళ పొగుడుతున్నారు. అన్నట్టు నా నవల తప్పక చదవమంటూ ఆంధ్రదేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలూ, సినిమా పాటల మధ్య ప్రకటనలు చేస్తున్నాయి. త్వరలోనే వివిధ భారతి కార్యక్రమాల్లోకూడా ప్రకటిస్తారట. ఈ పనంతా ఆ పత్రిక యజమాని చలవే. నాకు కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి తప్పకుండా వచ్చే అవకాశంవుందని కబురుకూడా విన్నాను.

*ప్రచురణ : అవగాహన -3, 1980 అక్టోబరు*